
సాక్షి
పల్నాడు
మంగళవారం । 15 । ఆగస్టు । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 518.10 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు వదిలారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2,000, గరిష్ట ధర రూ.3,400, మోడల్ ధర రూ.2,500 వరకు పలికింది.




సుబ్బారాయుడి సేవలో..

మోపిదేవి: శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దేవదాయ ధర్మదాయశాఖ అడిషనల్ కమిషనర్ కోడూరి రామచంద్ర మోహన్ సోమవారం దర్శించుకున్నారు.

స్వాతంత్య్ర పౌరుషం

న్యూస్‌రీల్

వావిలాల.. ఉద్యమ జ్వాల



వావిలాల గోపాలకృష్ణయ్య

సత్తెనపల్లి: స్వాతంత్య్ర సమరంలో నేను సైతం అంటూ బ్రిటీష్ పాలకులను ఎదిరించిన వీరుడు వావిలాల గోపాలకృష్ణయ్య. ఆయనో ఉద్యమ జ్వాల. వ్యక్తిగత, కుటుంబ జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు. జైలులో ప్రత్యక్ష నరకాన్ని చవి చూసి దేశం కోసం ఆయన చేసిన త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతాయి. 1906 సెప్టెంబర్ 17న సత్తెనపల్లిలో జన్మించిన వావిలాల యుక్తవయసులో మహాత్మాగాంధీ పిలుపు మేరకు స్వాతంత్య్రోద్యమంలో అడుగుపెట్టారు. జైలు జీవితం అనుభవించారు. స్వాతంత్య్ర వచ్చాక వావిలాల ప్రజాసేవకే అంకితమయ్యారు. 1952లో సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి ఎన్నికై తొలి శాసన సభ్యుడిగా సేవలందించారు. 1952, 1955, 1962, 1972 ఎనికల్లో వరుసగా నాలుగు సార్లు జయకేతనం ఎగురవేశారు. ప్రజల కోసమే జీవించి 2003 ఏప్రిల్ 29న అనారోగ్యంతో కన్నుమూశారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని చెరువు పక్కన ఏర్పాటైన వావిలాల ఘాట్ అభివృద్ధిపై గత పాలకులు శీత కన్నేశారు. దీంతో అప్పట్లో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు ఆ ప్రాంతాన్ని శుభ్రపరిచి వావిలాల వర్ధంతి నిర్వహించారు. దీంతో అప్పటిపాలకులు ఆ ఘాట్‌కు ఎన్టీఆర్ గార్డెన్‌గా పేరుమార్చారు. దీనిపై స్థానికులు మండి పడ్డారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే, జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చొరవ తీసుకొని ఆ ప్రాంతానికి వావిలాల స్మృతివనం (వావిలాల ఘాట్)గా నామకరణం చేయించి ఏటా జయంతి, వర్ధంతి నిర్వహిస్తున్నారు.

స్పందన రద్దు చేసినా కలెక్టరేట్‌కు ప్రజలు

30 మంది నుంచి అర్జీల స్వీకరణ




నరసరావుపేట: జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమం రద్దు చేసినా ఆ విషయం తెలియక వచ్చిన 30 మంది అర్జీదారుల సమస్యలు కలెక్టర్ ఎల్.శివశంకర్ సోమవారం సావధానంగా విన్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంగళవారం డీఎస్ఏ స్టేడియంలో స్వాతంత్య్ర వేడుకలు జరగనున్న దృష్ట్యా సోమవారం స్పందన కార్యక్రమాన్ని జిల్లా అధికారులు రద్దుచేశారు. అయినా కొందరు ప్రజలు అర్జీలు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు వచ్చారు. ఆ సమయంలో వేరే కార్యక్రమంలో ఉన్న కలెక్టర్ సహృదయంతో వారిని పిలిపించి సమస్యలు విని అర్జీలు స్వీకరించారు. ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, డీఆర్వో వినాయకం పాల్గొన్నారు.

స్వాతంత్య్ర వేడుకలకు ఏర్పాట్లు

పరిశీలించిన కలెక్టర్ శివశంకర్



నరసరావుపేట: నరసరావుపేట పట్టణ శివారు సత్తెనపల్లి రోడ్డులోని డీఎస్ఏ స్టేడియంలో స్వాతంత్య్ర వేడుకలకు అధికారులు అట్టహాసంగా ఏర్పాట్లు చేశారు. ఏర్పాట్లను సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పరిశీలించారు. వేడుకల్లో రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పాల్గొంటారు. ఉదయం 9 గంటలకు జాతీయపతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం 9.03 గంటలకు పోలీసు, ఎన్‌సీసీ దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించి సందేశమిస్తారు. 9.55 గంటలకు జిల్లాలోని స్వాతంత్య్ర సమరయోధులకు సన్మానం చేస్తారు. 10 గంటలకు వివిధశాఖల శకటాల ప్రదర్శన నిర్వహిస్తారు. 10.20 గంటలకు విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. 10.45 గంటల నుంచి 11.45 గంటల వరకు ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను మంత్రి అందిస్తారు. అనంతరం ముఖ్యఅతిథులు వివిధ శాఖల స్టాళ్లను సందర్శిస్తారు. సుమారు రెండువేల మంది కూర్చుని వేడుకలను తిలకించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.



ఉద్యమభేరి.. చైతన్యఝరి

స్వరాజ్యం నా జన్మహక్కు అంటూ బాలగంగాధర్ తిలక్ కంటే ముందే ఉమ్మడి గుంటూరు జిల్లా రణన్నినాదమై మార్మోగింది. నాగలి సమ్మెతో కదం తొక్కింది. బ్రిటిష్ సర్కారును గడగడలాడించింది. మహాత్మాగాంధీ పిలుపుతో స్వాతంత్య్ర సమరభేరి మోగించింది. సూర్యుడు అస్తమించని రాజ్య దురహంకారంపై గర్జించింది. అమర వీరుల రక్తంతో తడిసినా.. కడుపుకోతను దిగమింగి ఉక్కుపిడికిలెత్తి గోబ్యాక్ బ్రిటన్ అంటూ నినదించింది. జయ పతాకను రెపరెపలాడిస్తూ భారతావనికి జైకొట్టింది.



1905లో బెంగాల్ విభజన ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా వందేమాతరం ఉద్యమం సాగింది. 1907లో సూరత్‌లో జరిగిన కాంగ్రెస్ మహాసభల్లో అతివాద, మితవాద పక్షాలు ఏర్పడ్డాయి. 1908 వేసవిలో తెనాలిలో జరిగిన కృష్ణాజిల్లా కాంగ్రెస్ అసోసియేషన్ సమావేశం అతివాదులను బలపరిచింది. ఆనాటి చిత్రమిది.

ఉమ్మడి గుంటూరు జిల్లా గర్జన

- బ్రిటిష్ సేనలను గడగడలాడించిన సమరయోధులు
- పోరుబాటన మేముసైతం అంటూ ముందుకురికిన మహిళామణులు
- సమరస్ఫూర్తి రగిలించిన గాంధీ



కల్లూరి చంద్రమౌళి



ముత్తేవి మాధవాచార్య



షేక్ అబ్దుల్ వహాబ్



కల్లూరి తులశమ్మ



సూర్యదేవర రాజ్యలక్ష్మి



కొడాలి కమలమ్మ

తెనాలి: స్వాతంత్య్ర సమరం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా మహోగ్రరూపం దాల్చింది. గ్రామగ్రామాన పౌరులు బ్రిటిష్ పాలకులపై గళమెత్తారు. బానిస సంకెళ్లను తెంచుకునేందుకు వీధుల్లోకి వచ్చి ఆగ్రహజ్వాలై రగిలారు. ఎందరో అసువులుబాసినా.. మరెందరో జైలుపాలైనా సడలని సంకల్పంతో ఉద్యమించారు. నేడు స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఒళ్లు గగుర్పొడిచే ఆనాటి పోరాట ఘట్టాల సమాహారమిది..

నాగలి కన్నెర్ర

1857లో జరిగిన భారత ప్రథమ స్వాతంత్య్ర పోరాటం కంటె ముందే జిల్లాలోని నాదెండ్ల సమితిలో నాగలి సమ్మె జరిగింది. అప్పట్లో కృష్ణాజిల్లాలో ఉన్న గుంటూరు ప్రాంతంలో కరువు తాండవించింది. పన్ను బకాయిల వసూళ్ల కోసం ఆస్తుల జప్తునకు బ్రిటిష్ పాలకులు సిద్ధపడ్డారు. తిరగబడిన రైతులు నాగలి, గొర్రు, గుంటక, పలుగు, పారమంచెపై పెట్టి వ్యవసాయం మానేసి, చేతివనివారితో సహా సమ్మె చేశారు. పాలకులు దిగొచ్చి పన్నులను రద్దుచేశారు. గ్రామీణ శ్రామిక జనాలు సమైక్యంగా పోరాడిన తొలి సంగ్రామ ఘట్టమిది.

కదంతొక్కిన కోటప్పకొండ

1909 ఫిబ్రవరి 18న కోటప్పకొండ తిరునాళ్లలో బ్రిటిష్ సేనల దాష్టీకానికి వ్యతిరేకంగా ప్రజలు తిరగబడ్డారు. అక్కడి పోలీసు ఠాణాను తగులబెట్టారు. ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు చనిపోయారు. కొత్తరెడ్డిపాలెంకు చెందిన చిన్నపరెడ్డితో సహా 45 మందిని అరెస్టుచేశారు. చిన్నపరెడ్డికి ఉరిశిక్ష వేశారు. 1909లోనే బ్రిటిష్ వైశ్రాయ్ ప్రయాణించనున్న రైలును పేల్చేందుకని కుట్రపన్నిన కేసులో తెనాలి సమీపంలోని కంచర్లపాలెంకు చెందిన చుక్కపల్లి రామయ్య, కఠెవరంవాసులు కోటంరాజు వెంకట్రాయుడు, లక్కరాజు బసవయ్యను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిద్దరికీ ద్వీపాంతర వాస శిక్ష విధించారు. స్వదేశీ వస్తువులను మాత్రమే విక్రయించాలనే ఉద్యమానికి గుంటూరులో కొండా వెంకటప్పయ్య, వింజమూరి భావనాచారి నాయకత్వం వహించారు. మాంటేగ్–చేమ్స్‌ఫర్డ్ సంస్కరణలపై 1918 ఆగస్టు 17న గుంటూరులో ఆంధ్ర మహాసభ కాశీనాథుని నాగేశ్వరరావు అధ్యక్షతన సమావేశమైంది.

విద్యార్థుల తరగతుల బహిష్కరణ

హోమ్ రూల్ ఉద్యమంలో భాగంగా మచిలీపట్నంలో ఏర్పాటైన జాతీయ పాఠశాలకు వెళ్లి, శిక్షణ తీసుకున్నవారు, 1920లో తెనాలిలో జాతీయ పాఠశాలను ఆరంభించారు. 1920–21లో ప్రభుత్వం తన ఆధీనంలోని పాఠశాలలు, కాలేజీలను జాతీయ విద్యాసంస్థలుగా మార్పు చేయాలంటూ జరిగిన విద్యార్థుల ఆందోళనలో భాగంగా తెనాలిలో తాలూకా హైస్కూలు విద్యార్థులు 1,050 మంది వారంపాటు తరగతులను బహిష్కరించారు. ఫలితంగా అదే ఏడాది 44 జాతీయ పాఠశాలలు ఏర్పాటయ్యాయి.

పదవులకు రాజీనామా

సహాయ నిరాకరణ ఉద్యమంలో భాగంగా మద్రాస్ లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యత్వానికి కొండా వెంకటప్పయ్య రాజీనామా చేశారు. రాష్ట్రంలో నలుగురు ప్రముఖులు గౌరవ మేజిస్ట్రేట్ పదవులకు రాజీమా చేయగా అందులో మౌల్వీ మొహమ్మద్ రజాసాహెబ్, ఏలూరు హనుమంతరావు జిల్లాకు చెందినవారు. 1920 సెప్టెంబరు 28న గుంటూరు బార్ అసోసియేషన్ చేసిన తీర్మానంతో న్యాయవాదులు 11 నెలలు విధులను బహిష్కరించారు. 1942లో జరిగిన క్విట్‌ఇండియా ఉద్యమంలో తెనాలిలో హింస ప్రజ్వరిల్లింది. సాయుధ బలగాల కాల్పుల్లో ఏడుగురు అమరులయ్యారు. తర్వాతి రోజు గుంటూరు గాంధీపార్కులో రెండువేల మంది సమావేశమయ్యారు. పోలీసుల కాల్పుల్లో ముగ్గురు చనిపోయారు. కాంగ్రెస్‌పై నిషేధం వల్ల 1945లో ఏలూరులో అయ్యదేవర కాళేశ్వరరావు అధ్యక్షతన ఆంధ్ర అసెంబ్లీ కాంగ్రెస్‌ను ఏర్పాటుచేశారు. తెనాలి నేత కల్లూరి చంద్రమౌళిని అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. కల్లూరి తులశమ్మ, సూర్యదేవర రాజ్యలక్ష్మి, కొడాలి కమలమ్మ వంటి వనితా యోధులూ పోరుబాట పట్టారు.

పుల్లరి ఉద్యమం



'పుల్లరి' యోధుడు కన్నెగంటి హనుమంతు

అడవుల్లో పశువుల మేత కోసం పుల్లరి పన్ను చెల్లించకూడదనే ఉద్దేశంతో పల్నాడు ప్రజలు ఉద్యమించారు. ప్రభుత్వోద్యోగుల్ని సాంఘికంగా బహిష్కరించారు. ఈ సమయంలో మాచర్లకు వెళ్లిన ఉన్నవ లక్ష్మీనారాయణ, వేదాంతం లక్ష్మీనరసింహాచార్యులుకు బ్రిటిష్ ప్రభుత్వం ఏడాది జైలుశిక్ష విధించింది. నిరసనగా గుంటూరులో వారంరోజులు హర్తాళ్ నిర్వహించారు. పల్నాడులో అటవీ శాసనోల్లంఘనాన్ని తీవ్రతరం చేశారు. 1921 సెప్టెంబరు 23న సాయుధ దళాలు అడవిలో మేపుతున్న పశువులను అడ్డుకుని బందెలదొడ్డికి తరలించారు. కోపోద్రిక్తులైన ప్రజలు రాళ్లవర్షం కురిపించారు. పోలీసు కాల్పుల్లో ఉద్యమనేత కన్నెగంటి హనుమంతు సహా ముగ్గురు మరణించారు.

కొండా వెంకటప్పయ్య నేతృత్వం



త్రిపురనేని రామస్వామి



కొండా వెంకటప్పయ్య

1923లో అఖిల భారత జాతీయ కాంగ్రెస్ మహాసభకు అధ్యక్షుడిగా కొండా వెంకటప్పయ్య నియమితులయ్యారు. 1928 ఫిబ్రవరిలో సైమన్ కమిషను వచ్చినపుడు దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లో భాగంగా తెనాలిలో బహిష్కరణ ఉచ్ఛస్థితిలో నిర్వహించారు. ఉప్పు సత్యాగ్రహంలోనూ జిల్లా నుంచి వందలమంది పాల్గొన్నారు. జైలుశిక్షను అనుభవించారు. జిల్లాలో ఉద్యమానికి కొండా వెంకటప్పయ్య, నడింపల్లి వెంకట లక్ష్మీనరసింహారావు, శరణు రామస్వామి చౌదరి నాయకత్వం వహించారు. హేతువాద ఉద్యమ ప్రముఖుడు త్రిపురనేని రామస్వామి, 'వీరగంధం తెచ్చినాము.. వీరులెవ్వరో తెల్పుడీ' గేయంతో ఉత్తేజాన్ని కల్పించారు. 1941లో సత్యాగ్రహంలో పాల్గొన్న వావిలాల గోపాలకృష్ణయ్య, కల్లూరి చంద్రమౌళి, భారతీదేవి రంగాను బ్రిటిష్ ప్రభుత్వం అరెస్టు చేసింది.

పన్నుల చెల్లింపు నిరాకరణ



పర్వతనేని వీరయ్యచౌదరి

1922లో ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ పన్నుల నిరాకరణ తీర్మానాన్ని జిల్లాలో, ముఖ్యంగా పెదనందిపాడు ఫిర్కా అమలుచేసింది. ఇక్కడ అన్ని గ్రామాల్లోని కరణాలు, మునసబులు రాజీనామా చేశారు. కాంగ్రెస్ 'శాంతిసేన' సైనికులు ప్రభుత్వంపై నిరాదరణ, సహాయనిరాకరణ తీవ్రంచేశారు. అణచివేతను బ్రిటిష్ ప్రభుత్వం జిల్లా అదనపు కలెక్టరు రూదర్‌ఫర్డ్‌కు అప్పగించింది. ఆస్తుల జప్తుకు పూనుకున్నా సాధ్యపడకుండా పర్వతనేని వీరయ్యచౌదరి, చిత్రవిచిత్రమైన వ్యూహాలతో ప్రజలు, శాంతిసేన సైనికులను నడిపించారు.

సీఐ వాసుకు ఇండియన్ పోలీస్ మెడల్



పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): దేశ సరిహద్దులో మండే ఎండ.. ఎముకలు కొరికే చలి.. వర్షాన్ని లెక్క చేయకుండా సేవలందించిన జవాన్ ఆయన.. ఆర్మీ నుంచి వచ్చిన తరువాత ప్రజా సేవ చేయాలనే తలంపుతో పోలీసు శాఖలో ఎస్ఐగా చేరారు. ఎన్నో కేసులు ఛేదించారు.. మరెన్నో అవార్డులు తీసుకున్నారు. ఆయనే మేడికొండూరు సీఐ కె.వాసు. ఆయన విశేష పనితీరును గుర్తించిన కేంద్ర ప్రభుత్వం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఇండియన్ పోలీస్ మెడల్ (ఐపీఎం)కు ఎంపిక చేసింది.

ఇదీ ప్రస్థానం..

1998లో ఆర్మీలో చేరిన వాసు కాశ్మీర్, పంజాబ్, గుజరాత్‌తోపాటు పలు ప్రాంతాల్లో బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్)లో పనిచేశారు. 1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలోనూ పోరాడారు. బీఎస్ఎఫ్ నుంచి బయటకు వచ్చిన ఆయన 2004లో ఆర్మ్ రిజర్వ్‌డ్ (ఏఆర్) ఎస్ఐగా ఎంపికయ్యారు. ఏడేళ్ల పాటు యాంటీ నక్సల్ స్క్వాడ్ (ఏఎన్ఎస్)లో పని చేసి 2011లో కఠిన సేవా పతకం పొందారు. 2014లో సివిల్ పోలీసు విభాగానికి కన్వర్ట్ అయిన వాసుకు 2021లో సీఐగా ఉద్యోగోన్నతి లభించింది. గుంటూరు జిల్లాలో సెల్‌ఫోన్ కంటైనర్ చోరీ చేసిన మధ్యప్రదేశ్ ఖంబిర్‌భట్‌కు చెందిన దొంగలను చాకచక్యంగా పట్టుకోవడంలో వాసు ప్రతిభ కనబరిచి డీజీపీ నుంచి మెడల్‌ను పొందారు. బీటెక్ విద్యార్థిని రమ్య హత్య కేసులో నిందితుడిని గంటల వ్యవధిలో పట్టుకోవటంతోపాటు, అతనికి ఉరిశిక్ష పడేందుకు పాటుపడ్డారు. దీనికి కేంద్రహోం శాఖ మంత్రి నుంచి అవార్డు పొందారు. అంత్రిక్ సురక్ష సేవా పతకం, ఉత్రిక్ష సేవా పతకం, ఏబీసీడీ అవార్డు వంటివి అందుకున్నారు. తాజాగా ఉత్తమ సేవల విభాగంలో ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సీఐ కె.వాసు మాట్లాడుతూ ఐపీఎం అవార్డుకు ఎంపిక కావటం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

టీడీపీ ఆప'షో'పాలు

- పార్టీ కండువా కప్పుకుంటే రూ.వెయ్యి
- దుస్తులు, మందు, బిర్యానీ ఉచితం
- చేర్పినవారికీ ప్యాకేజ్
- లోకేష్ యాత్ర కోసం నేతల అవస్థలు



మంగళగిరి: లోకేష్ యాత్ర కోసం తెలుగుదేశం నేతలు ఆపసోపాలు పడుతున్నారు. యాత్ర సందర్భంగా భారీగా చేరికలు ఉన్నట్లు చూపించడం కోసం భారీగా నగదు ఖర్చుచేస్తున్నారు. పార్టీలో చేరిన వారికి ఒక ప్యాకేజి, చేర్పిన వారికి మరో ప్యాకేజి ఇవ్వజూపుతున్నారు. వంద మందిని చేరిస్తే ఒక ధర ఇంకా ఎక్కువ మందిని చేరిస్తే మరో రేటు ఇచ్చి లోకేష్ సమక్షంలో పార్టీ కండువాలు కప్పించాలని అధినేత నుంచి ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో బాగానే సంపాదించుకున్నారు కదా.. ఖర్చు పెట్టాల్సిందేనని అధిష్టానం నుంచి ఒత్తిడి రావడంతో పార్టీ నేతలు మింగలేక కక్కలేక అవస్థలు పడుతున్నారు.

మూడువేల మందిని చేర్చాలని బాబు హుకుం

సోమవారం రాత్రి మంగళగిరి నియోజకవర్గంలోకి లోకేష్ యాత్ర ప్రవేశించనుండడంతో ప్రస్తుతం ఉన్న నాయకులు, కార్యకర్తల్లో టెన్షన్ మొదలైంది. తొలిరోజే మూడువేల మందిని పార్టీలో చేర్చాలని చంద్రబాబు నేతలకు హుకుం జారీ చేసినట్లు సమాచారం. గతంలో రెండుమూడుసార్లు రత్నాలచెరువు ఎస్టీకాలనీ నుంచి పలువురిని డబ్బులు ఇచ్చి పార్టీలో చేర్పించారు. ఈ చేరికల సందర్భంగా ఆర్థికంగా లబ్ధిపొందిన తెలుగుదేశం లీగల్ విభాగానికి చెందిన వ్యక్తితోపాటు గతంలో టీడీపీ కార్యాలయంలో పనిచేసి తొలగించబడిన మరో కార్యకర్త ప్రస్తుతం ఈ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మాజీ ఇన్‌చార్జ్ పోతినేని శ్రీనివాసరావుతో సహా పలువురు నేతలు చేతులెత్తేయగా మరికొందరు లక్ష్యాలు విధించడంతో ఇదెక్కడి ఖర్మరా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యర్రబాలెంకు చెందిన రెండువర్గాల నేతలకు ఐదు వందల మందిని చేర్చాలని ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. కూరగల్లు, నిడమర్రు, బేతపూడి, పెదవడ్లపూడి నేతలకూ ఇలాగే టార్గెట్లు పెట్టినట్టు సమాచారం.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలంటూ.. దుష్ప్రచారం

గతంలో ఎన్నడూ వైఎస్సార్ సీపీలో లేని వారిని తీసుకొచ్చి ఆ పార్టీ కార్యకర్తలుగా పరిచయం చేసి టీడీపీలో చేర్చుకుంటుండడంతో టీడీపీ కార్యకర్తలే ఆశ్చర్యపోతున్నారు. గతంలోనే టీడీపీ కండువా కప్పుకున్నవారు ఇప్పుడు పెద్దమొత్తంలో ఇస్తే మళ్లీ కప్పుకుంటామని చెప్పడంతో టీడీపీ నేతలు అవసరమైతే రెండుమూడురెట్లు అదనంగా ఇస్తుండడం చర్చనీయాంశమవుతోంది. నేరుగా లోకేష్ అనుచరులే రంగంలోకి దిగి పార్టీ కండువా కప్పుకుంటే రూ.వెయ్యి, బిర్యాని ప్యాకెట్, మద్యం పంపిణీ చేసేలా ఒప్పందం చేసుకున్నట్లు జోరుగా చర్చ జరుగుతోంది.

వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్‌కే ఓటు!

మంగళగిరి ఎస్టీ కాలనీకి చెందిన పలువురు మాట్లాడుతూ ఇప్పటికే తాము లోకేష్‌తో రెండు సార్లు పార్టీ కండువా కప్పించుకున్నామని, రూ.వెయ్యి చొప్పున ఇచ్చారని, మళ్లీ చేరాలని టీడీపీ నేతలు కోరారని చెప్పారు. కాలనీ నుంచి సుమారు 150 మంది రావాలన్నారని, రూ.వెయ్యి, బిర్యాని, మద్యం ఇస్తామన్నారని పేర్కొన్నారు. కృష్ణాయపాలెం నుంచి గతంలో ఎస్సీ,ఎస్టీ కేసులు ఎదుర్కొన్న వారిని రైతులుగా చూపి వారిని పార్టీలో చేర్చి ఎస్సీలతో లోకేష్ ముందు మాట్లాడించేందుకు టీడీపీ నేతలు యత్నిస్తున్నట్లు సమాచారం. ఎమ్మెల్యే ఆర్కే, సీఎం జగన్‌కు వ్యతిరేకంగా మాట్లాడించేందుకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారని స్థానికులు చెప్పడం విశేషం. ఈ సందర్భంగా పలువురు లోకేష్‌తో కండువా కప్పించుకున్నా.. చివరకు ఎన్నికల్లో ఫ్యాన్‌కే ఓటేస్తామని, ఇప్పుడు వచ్చే డబ్బులను ఎందుకు వదులుకోవాలని ప్రశ్నిస్తుండడం కొసమెరుపు.

టీటీడీకి పర్చూరు నుంచి శనగలు

పర్చూరు(చినగంజాం): ప్రకృతి విధానంలో పండించిన శనగలను అధికారులు తిరుమల తిరుపతి దేవస్థానానికి పంపించారు. సోమవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో 14 శాతం తేమకు మించని 190 టన్నుల శనగలను ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేశారు. వాటిని మూడు లారీలలో తిరుమలకు పంపించేందుకు మండల వ్యవసాయాధికారి రామ్మోహన్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. తిరుమలలో జరిగే నిత్యాన్నదానం కోసం నాణ్యమైన శనగలను పంపించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ సీహెచ్ అప్పారావు పాల్గొన్నారు.

శాశ్వత నీటి వనరుల కల్పన ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి అంబటి రాంబాబు
- వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం ప్రారంభం


దేచవరం గ్రామంలో జగనన్న పాలవెల్లువ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అంబటి రాంబాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తదితరులు

నకరికల్లు: నీటి అవసరాలను శాశ్వతంగా తీర్చుకోవడంతోపాటు భూగర్భ జలవనరులను పెంచుకునేందుకు చెరువులు అభివృద్ధి చేసుకోవాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మండలంలోని దేచవరం గ్రామంలో ఆజాదీకా అమృత మహోత్సవ్ కార్యక్రమంలో పాల్గొని మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో జగనన్న పాలవెల్లువ, రూపెనగుంట్లలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను సోమవారం ప్రారంభించారు. గ్రామంలోని అమృతసరోవర్ వద్ద మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ అంటువ్యాధులు ప్రబలకుండా సంపూర్ణ ఆరోగ్యం కోసం సురక్షిత మంచినీరు అవసరమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తాగునీటి కోసం ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. నీటి ఆవశ్యకతను గుర్తించి పొదుపుగా వాడుకోవాలని అన్నారు. రూ.10లక్షల ఎంపీ నిధులతో నీటిని పరిశుభ్రం చేసేందుకు ఫిల్టర్‌బెడ్‌లు ఏర్పాటు చేశారన్నారు. దేచవరంలో రూ.15.74లక్షలతో జగనన్న పాలవెల్లువ భవనం, రూపెనగుంట్లలో రూ.20లక్షలతో వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ప్రారంభించినట్లు తెలిపారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ దేచవరం గ్రామంలోని చెరువును ఎంపీ నిధులతో అభివృద్ధి చేసుకోవడంతోపాటు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆరోగ్యం కోసం చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. పల్నాడు జిల్లాలో 123 ఆర్వో వాటర్‌ప్లాంటు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జలజీవన్‌మిషన్ ద్వారా నిధులు మంజూరయ్యాయని ఇంటింటికి తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దేచవరం చెరువులతో నాలుగు గ్రామాలకు బహుళ ప్రయోజనాలు చేకూరతాయని అన్నారు. మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక నాడు-నేడుతో పాఠశాలల రూపురేఖలు మార్చారని అన్నారు. సురక్షిత మంచినీటి అందించాలని నిధులు వెచ్చించి ఆర్‌ఓ ప్లాంట్లు, చెరువుల ఆధునికీకరణ చేపడుతున్నారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, వైస్ ఎంపీపీలు మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దూదేకుల హుస్సేన్‌బీ బాషా, జెడ్పీటీసీ సభ్యుడు జూనెబోయిన హరీష్, సొసైటీ అధ్యక్షుడు మేడికొండ మస్తాన్‌రెడ్డి, దొండేటి కోటిరెడ్డి, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, ఏపీఓ రామకృష్ణ, కోనంకి ఆదినారాయణ, గోగా యలమంద, సూదులగుంట్ల బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 14 వార్డులకు ఎన్నికలు

రెండు పంచాయతీలు ఏకగ్రీవం

నరసరావుపేట: జిల్లాలోని ఎనిమిది మండలాల పరిధిలోని 14 వార్డులకు ఈనెల 19న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి భాస్కరరెడ్డి సోమవారం వెల్లడించారు. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో వివరాలను వెల్లడించారు. జిల్లాలో రొంపిచర్ల మండలంలోని రామిరెడ్డిపాలెం, క్రోసూరు మండలంలోని గరికపాడు గ్రామాలకు సర్పంచు పదవులకు ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదల చేయగా ఆ రెండు పంచాయతీలకు ఏకగ్రీవమయ్యాయన్నారు. 20 మండలాల పరిధిలోని 48 వార్డుల ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల కాగా 34 వార్డులు ఏకగ్రీవమయ్యాయన్నారు. మిగిలిన 14 వార్డులకు ఇద్దరేసి చొప్పున 29మంది పోటీపడుతుండగా అందులో పెదకూరపాడులోని వార్డుకు ముగ్గురు పోటీపడుతున్నారని వెల్లడించారు.

ఇళ్లల్లో చోరీలకు పాల్పడే ముఠా అరెస్టు

- జైల్లో పరిచయాలు.. చోరీలకు పన్నాగం
- రూ.16.50 లక్షల సొత్తు, విదేశాల కరెన్సీ స్వాధీనం


మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్. చిత్రంలో ఏఎస్పీలు శ్రీనివాసరావు, సుప్రజ

నగరంపాలెం: ఇళ్లల్లో చోరీలకు పాల్పడే ముఠాను మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్టు చేశా రు. గడిచిన రెండు నెలల్లో జరిగిన తొమ్మిది కేసుల్లో రూ.16.50 లక్షల విలువైన బంగారం, వెండి, నగదు, మరో కేసులో విదేశాల కరెన్సీ సీజ్ చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీవో) ఆవరణలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో కేసుల వివరాల్ని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ వెల్లడించారు. గత రెండు నెలలో మంగళగి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాజా, చినకాకాని, ఎర్రబాలెం గ్రామాల్లో, ఎన్నారై జంక్షన్ వద్ద తొమ్మిది ఇళ్లల్లో దొంగతనాలు జరిగాయి. వరుస చోరీల్ని కట్టడి చేసేందుకు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ ఆదేశాల మేరకు మంగళగిరి రూరల్, గుంటూరు సీసీఎస్ పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి జల్లెడ పట్టారు. అందులో ఓ పాత నేరస్తుడి వేలిముద్రలు సరిపోవడంతో ఆ దిశగా సాంకేతిక పరిజ్ఞానంతో వేగవంతంగా దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా కొయ్యలగూడెం మండలం గౌరవరం గ్రామ వాసి తోట శివకుమార్ అలియాస్ శివ భవాని, విజయవాడ పాయకాపురం సింగ్‌నగర్‌లో ఉంటున్న మంగళగిరి రత్నాలచెరువు 13వ వీధికి చెందిన వెంగళ భవానీశంకర్, విశాఖపట్నం మురళీనగర్ లాస్ట్ బస్టాఫ్‌కు చెందిన లాలం లోకేశ్వరరావు, మంగళగిరి టిడ్కో గృహ సముదాయంలో ఉంటున్న వనం శివనాగేశ్వరరావును అరెస్టు చేసినట్లు ఎస్పీ వివరించారు. తొమ్మిది చోరీ కేసుల్లో రూ.16.50 లక్షల విలువ చేసే 294 గ్రాముల బంగారం, 800 గ్రాముల వెండి, రూ.75 వేలు, సామర్లకోట పట్టణ పరిధిలోని ఓ ఇంట్లో జరిగిన చోరీ కేసులో విదేశాల కరెన్సీ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసుల్ని త్వరితగతిన ఛేదించిన ఏఎస్పీ ఎ.శ్రీనివాసరావు (క్రైం), ఉత్తర డీఎస్పీ రాంబాబు, మంగళగిరి రూరల్ పీఎస్ సీఐ వి.భూషణం, ఎస్‌ఐలు బి.జగన్‌మోహన్‌రావు, జె.క్రాంతికిరణ్, వి.బాబూరావు (సీసీఎస్), పలువురి పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించి, ప్రశంస పత్రాల్ని అందించారు. ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ పాల్గొన్నారు.

వయసు 32.. కేసులు 70కి పైగా..

ముఠాలో కీలక వ్యక్తి శివ భవానీ. పగటిపూట తాళాలు వేసిన ఇళ్లను గుర్తించేవాడు. ఒకవేళ జనసంచారంతో రద్దీ ఉన్నట్లైతే రాత్రిపూట దొంగతనాలకు పాల్పడేవాడు. అతని వద్దనున్న ఇనుపరాడ్‌తో ఇళ్ల తాళాలను తేలిక్గా పగులకొట్టేవాడు. అయితే శివ భవానీ, లోకేశ్వరరావుపై సస్పెక్ట్ షీట్‌లున్నాయి. వీరిద్దరికీ రాజమండ్రి కేంద్ర కారాగారంలో పరిచయం ఏర్పడింది. శివ భవానీపై దాదాపు 70కి పైగా కేసులున్నాయి. ఇళ్ల దొంగతనాలు చేయడంలో ఆరితేరినవాడు. ఇందులో రిసీవర్ అయిన శివనాగేశ్వరరావు, వెంగళ భవానీ శంకర్ బాల్య స్నేహితులు. వీరందరూ ఒక ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడ్డారు.

దేశ విభజనపై ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభం


ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ

లక్ష్మీపురం: దేశ విభజన సమయంలో చోటు చేసుకున్న సంఘటనలపై గుంటూరు రైల్వేస్టేషన్‌లో ఫొటోలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ తెలిపారు. ఒకటో నంబరు ప్లాట్‌ఫారంపై సోమవారం ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ముందుగా రైల్వే స్టేషన్‌లో స్వాతంత్ర్య పోరాటం గురించి వివరిస్తూ ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చే ముందు రోజు 14న దేశ విభజన సందర్భంగా చోటు చేసుకున్న అవాంఛనీయ ఘటనలపై యువత పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు త్యాగం చేసిన అమరవీరుల జీవిత చరిత్రల గురించి తెలుసుకునేందుకు ప్రదర్శన దోహదపడుతుందని తెలిప్పారు. కార్యక్రమంలో డివిజన్ అదనపు ఏడీఆర్‌ఎంలు సైమన్, సీనియర్ డీసీ కో- ఆర్డినేషన్ అనూష, సీనియర్ డీపీవో షాబాజ్ హనూర్, డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కమలాకర్‌బాబు పాల్గొన్నారు.

అమరవీరులను స్మరించుకుందాం


ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసులు

బాపట్లటౌన్: అమరవీరులను స్మరించుకోవడమే ఆజాదీకా అమృత్ మహోత్సవం ధ్యేయమని జిల్లా ఏఆర్ డీఎస్పీ ఎండీహెచ్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా నా భూమి... నా దేశంలో నేల తల్లికి నమస్కారం- వీరులకు వందనం కార్యక్రమాన్ని సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. తొలుత జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో అధికారులు, సిబ్బంది జాతీయ జెండాను ఎగురవేసి, అమరవీరులకు వందనం చేశారు. వారి త్యాగాలను స్మరించుకున్నారు. డీఎస్పీ పోలీస్ అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అమరవీరుల త్యాగాలకు గుర్తుగా జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో మొక్క నాటారు. ఏఆర్ డీఎస్పీ ఎండీహెచ్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ఈనెల 9వ తేదీ నుంచి 'నా భూమి- నా దేశం, నేల తల్లికి నమస్కారం- వీరులకు వందనం' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో బాపట్ల డీఎస్పీ టి.వెంకటేశులు, ఎస్‌బీ సీఐ ఎ.శ్రీనివాస్, వెల్ఫేర్ ఆర్‌ఐ బి.శ్రీకాంత్‌నాయక్, అడ్మిన్ ఆర్‌ఐ ఎల్.మన్మథరావు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యం

- ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి
- 34 ఫిర్యాదులు స్వీకరణ


బాధితుల సమస్యలు వింటున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యమిచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అధ్యక్షత వహించి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారిచే 34 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన వాటిలో అధిక భాగం కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలు, ఆయా సమస్యలకు సంబంధించి ఫిర్యాదులు ఉన్నాయి. ప్రతి ఫిర్యాదుదారుని సమస్య పట్ల శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు కృషిచేయాలని ఎస్పీ ఆదేశించారు. ప్రజలకు వారి ఫిర్యాదులను రాసిపెట్టడంలో పోలీస్ సిబ్బంది సహాయ సహకారాలు అందజేశారు. పట్టణానికి చెందిన ప్రవల్లికా సత్యం, రమాదేవి భోజనశాలలో ఉచిత అన్నదానం నిర్వహించారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) ఆర్.రాఘవేంద్ర, ఏఆర్ అదనపు ఎస్పీ డి.రామచంద్రరాజు, క్రైం అదనపు ఎస్పీ ఎస్.కె చంద్రశేఖర్, డీఎస్పీలు కేపీ మహేష్, పల్లపు రాజు, బి.ఆదినారాయణ, యు.రవిచంద్ర సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తామని మోసం

గుంటూరులోని వికలాంగుల ఆఫీసులో క్లర్కు ఉద్యోగం ఇప్పిస్తానని ఓ వ్యక్తి నమ్మబలికి నా వద్ద నుంచి రూ.1.5లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకుండా, నగదు తిరిగి చెల్లించకుండా వేధిస్తున్నాడు. నా డబ్బులు నాకు ఇప్పించి అతడిపై చర్యలు తీసుకోండి.

–ఓ దివ్యాంగురాలు, గురజాల

అధిక కట్నం కోసం వేధిస్తున్నారు

నాకు సుమారు ఎనిమిదేళ్ల కిందట వివాహమైంది. అప్పటి నుంచి భర్త, అత్తమామలు అధిక కట్నం కోసం వేధిస్తున్నారు. ఒకసారి బలవంతంగా అబార్షన్ కూడా చేయించారు. వారి బారి నుంచి నన్ను రక్షించి న్యాయం చేయండి.

–ఓ వివాహిత, పిడుగురాళ్ల

రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ముల దుర్మరణం

- కట్టుబడివారిపాలెంలో విషాదం
- కుమార్తె అన్నప్రాశనకు వచ్చి ఒకరు...
- పెళ్లి భజంత్రీలు మోగకుండానే మరొకరు..


రమేష్‌బాబు(ఫైల్)


బాలకృష్ణ(ఫైల్)

చిలకలూరిపేట: రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములు దుర్మరణం పాలైన సంఘటన పల్నాడు జిల్లా తిమ్మాపురం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. జిల్లాలోని చిలకలూరిపేట మండలం కట్టుబడివారిపాలెం గ్రామానికి మోపూరు చిన్న కృష్ణారావు, గోవిందమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. తొలి సంతానమైన కుమార్తె కోటేశ్వరి కాగా, ఆ తదుపరి వరుసగా రమేష్‌బాబు(31), బాలకృష్ణ (28) ఉన్నారు. రమేష్‌బాబు విశాఖపట్నంలో సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతనికి రెండేళ్ల కిందట భూలక్ష్మితో వివాహం జరిగింది. వీరికి ఆరునెలల పాప మనస్విని ఉంది. పాప మనస్వినికి ఈనెల 11న అన్నప్రాశన కార్యక్రమం ఉండటంతో స్వగ్రామైన కట్టుబడివారిపాలెం గ్రామానికి వచ్చాడు. సోదరుడు బాలకృష్ణ నాదెండ్ల మండలం సాతులూరు గ్రామ పరిధిలో రైల్వే గేట్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఇరువురు అన్నదమ్ములు సోమవారం విధులకు హాజరు కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అన్న రమేష్‌బాబు విశాఖపట్నం వెళ్లేందుకు గుంటూరు రైల్వేస్టేషన్‌లో దింపేందుకు ద్విచక్రవాహనంపై ఇరువురు బయలుదేరారు. ఈ క్రమంలో యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామం వద్ద జాతీయ రహదారిపై చిలకలూరిపేట వైపు నుంచి గుంటూరు వెళుతున్న లారీ వెనుకగా ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఇరువురిపై లారీ చక్రాలు ఎక్కడంతో అన్నదమ్ములు ఇరువురు సంఘటన స్థలంలోనే మృతి చెందారు. బాలకృష్ణకు సైతం అక్కకూతురుతో నిశ్చితార్థం కూడా జరిగింది. ఈ నేపథ్యంలో వారి కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించారు. ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములు ఇరువురు అకాల మృత్యువాత పడటంతో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు నెలకొన్నాయి. కళ్లముందే ఇద్దరు కన్న కొడుకులను కోల్పోయి ఆసుపత్రి ప్రాంగణంలో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తండ్రి చిన్న కృష్ణారావు తీరు చూపరులను కంట తడిపెట్టించింది.

జిల్లాలో పకడ్బందీగా రేషన్ బియ్యం పంపిణీ

- ఎండీయూ వాహనాల ద్వారా డోర్‌డెలివరీ
- తప్పుడు కథనాన్ని ఖండించిన జిల్లా అధికారి

నరసరావుపేట:జిల్లాలో 6,36,802 మంది లబ్ధిదారులకు మంజూరైన 8997.06 మెట్రిక్ టన్నుల ఫోర్టిఫైడ్ రేషన్ బియ్యంను 402ఎండీయూ మొబైల్ వాహనాల ద్వారా ఇంటింటికి పకడ్బందీగా పంపిణీ చేస్తున్నట్లు జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి ఎస్.పద్మశ్రీ వెల్లడించారు. గడప చేరని రేషన్ అంటూ ఓ దినపత్రిక(సాక్షిలో కాదు)లో సోమవారం ప్రచురితమైన కథనాన్ని ఆమె ఖండించారు. ఖచ్చితమైన తూకం, లబ్ధిదారుల వేలిముద్రలను సేకరించి బియ్యం పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. డోర్ డెలివరీని నిత్యం అధికారులుగా మేము పరిశీలిస్తున్నామన్నారు. ఎండీయూ వాహనం ఇళ్ల వద్దకు రాకపోతే టోల్‌ఫ్రీ నంబరు 1967 ఫోన్‌చేసి ఫిర్యాదు చేసే అవకాశం కల్పించామన్నారు. వాహన ఆపరేటర్ రాకపోతే వీఆర్వోచే పంపిణీ చేయిస్తున్నామన్నారు. మొబైల్ వాహనం వచ్చే సమయానికి ముందుగానే వలంటీర్ల ద్వారా తెలియచేస్తున్నామన్నారు. డోర్ డెలివరీ ద్వారా నెలవారీ సరుకుల పంపిణీ 87 శాతం నుంచి 90శాతం వరకు జరుగుతున్నాయన్నారు. నిత్యావసర సరుకులు ప్రతినెలా లబ్ధిదారులకు అందే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

సఫాయి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డాక్టర్ పిపి.వావ



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వావ

పాత గుంటూరు: సఫాయి కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డాక్టర్ పి.పి.వావ తెలిపారు. వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సోమవారం సఫాయి కర్మచారి కార్మికుల సంక్షేమంపై నగరపాలక సంస్థ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు, సంఘాల ప్రతినిధులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. వావ మాట్లాడుతూ సఫాయి కార్మికులతో ప్రమాదకరంగా ఓపెన్ డ్రెయిన్లలో పనులు చేయించరాదని తెలిపారు. కరోనా సమయంలో పారిశుద్ధ్య కార్మికులు ప్రజల ప్రాణాలు కాపాడటం కోసం నిరంతరం కృషి చేశా రని కొనియాడారు. పారిశుద్ధ్య కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించి, ప్రీమియం కూడా నగరపాలక సంస్థ చెల్లించడం అభినందనీయమన్నారు. ప్రమాదవశాత్తు కార్మికుడు మరణిస్తే రూ.17 లక్షల వరకు పరిహారం అందుతుందని తెలిపారు. మరో 15 రోజుల్లో ప్రతి కార్మికుడికీ పీఎఫ్,ఈఎస్‌ఐ నంబర్‌తో ఐడీ కార్డులు అందించాలని అధికారుల్ని ఆదేశించారు. ఇన్‌చార్జ్ కమిషనర్ పెద్ది రోజా మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రతి గురువారం గ్రీవెన్స్ జరుపుతున్నామని చెప్పారు. కార్పొరేషన్ శానిటేషన్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సోమి శంకరరావు, ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈ.మధుబాబు, ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.ముత్యాలరావు, పారిశుద్ధ్య పనివారల సంఘం అధ్యక్షుడు మరియన్న, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కె.మాల్యాద్రి పాల్గొన్నారు.